# లష్కర్‌లో గులాబీ జెండా ఎగురవేస్తాం

**డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్**

సికింద్రాబాద్, నవంబర్ 15 : లష్కర్‌లో మరో సారి గులాబీ జెండా ఎగురడం ఖాయమని డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. బుధవారం బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీనగర్‌లో ప్రచారం చేశారు. నగర డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, సికింద్రాబాద్ కార్పొరేటర్లు శైలజ, హేమలతో పాటు పద్మారావుగౌడ్ తనయులు కిరణ్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్ ప్రచారంలో పాల్గొన్నారు. సంజయ్ గాంధీనగర్‌లో పలువురు యువకులు, మైనారిటీ నాయకుడు కలీంబాయ్ ఆధ్వర్యంలో పలువురు పద్మారావుగౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి పద్మారావుగౌడ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.... బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పాదయాత్రలో వివరిస్తూ గడప గడపకు ప్రచారం చేస్తున్నామని తెలిపారు. మ్యానిఫెస్టోలో రూపొందించిన పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకు రాంచందర్, బెజ్జంకి రాజేశ్, మంద జగన్, బాబా, మల్లేశ్ పాల్గొన్నారు.



సంజయ్ గాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్



ప్రచారంలో గులాబీ తల పాగాలు ధరించిన డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, మహిళా నేతలు

## అభివృద్ధికి పట్టం కట్టండి : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మూసాపేట ప్రచారంలో ఎమ్మెల్యే కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న మహిళలు, యువకులు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 15 : పదేండ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం బాలాజీనగర్, మూసాపేట, కేపీహెచ్‌బీ కాలనీల పరిధిలో పలుచోట్ల జరిగిన ఆత్మీయ సమ్మేళనాల్లో ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందిందన్నారు. నగరంలో నాడు ఎదుర్కొన్న సమస్యలన్నింటినీ ప్రణాళికాబద్ధంగా పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కుల, మతాలు, ప్రాంతాలకతీతంగా ప్రజలందరినీ సమాన దృష్టితో చూడటం అన్ని వర్గాల పండుగలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిందన్నారు. స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలను పరిష్కరించిన తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రతిపక్షాలు బయటి వ్యక్తులను తీసుకొచ్చి హడావిడి చేస్తున్నారే తప్పా ఎన్నికల్లో గెలిచే సత్తా వారికి లేదన్నారు. మూసాపేటకు చెందిన దేవసహాయం కొడుకు చిన్నాతో పాటు పలువురు యువనాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ నేతలున్నారు.

# బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

*ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్*



నర్కూడ గ్రామంలో ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

శంషాబాద్ రూరల్, నవంబర్ 15 : బీఆర్ఎస్‌తోనే గ్రామాలు సంపూర్ణ అభివృద్ధి చెందుతాయని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. బుధవారం శంషాబాద్ మండలంలోని నర్కూడ, చౌదర్‌గూడ, సుల్తాన్‌పల్లి, కాచారం, రాయన్నగూడ, నానాజీపూర్, మల్కారం, రామంజాపూర్, కవ్వగూడ గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నర్కూడ గ్రామంలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నీరటి తన్వీరాజు, ఎంపీపీ జయమ్మ, వైస్ ఎంపీపీ నీలంనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు కే చంద్రారెడ్డిలతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్ర ఏర్పాటుకు ముందు గ్రామాల అభివృద్ధికి నిధులు లేక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండేదని వివరించారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి కోసం కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని తెలిపారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గణేశ్ గుప్త, రాజుముదిరాజ్, శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఇస్తారి, రాజ్‌కుమార్, రాంగోపాల్, మాధవియాదగిరిరెడ్డి, రమేశ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు సతీశ్, దవాణాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ప్రభుసాగర్, శేఖర్‌ముదిరాజ్, శ్రీనివాస్, అశోక్ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, మల్లికార్జున్, బల్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులే బీఆర్ఎస్‌కు స్టార్ క్యాంపెయినర్లు

- అడగకున్నా.. సీఎం కేసీఆర్ పింఛన్ పెంచిండు
- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, నవంబర్ 15 : రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది దివ్యాంగులే బీఆర్ఎస్ పార్టీకి స్టార్ క్యాంపెయినర్లు అని, వారి సంక్షేమమే మా ధ్యేయమని అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం అంబర్‌పేట మహారాణా ప్రతాప్ హాలులో నిర్వహించిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులను సీఎం కేసీఆర్ తండ్రిలా కాపాడుకుంటున్నారని, వారి బాధలు గుర్తించి పింఛన్‌ను రూ.4016కు పెంచారని గుర్తు చేశారు. నిరుపేదలు, దివ్యాంగులకు బాసటగా నిలవడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో దివ్యాంగుల కోటా కింద డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేశామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న దివ్యాంగుల సంక్షేమంలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా కేంద్రం గుర్తించి అవార్డులు కూడా ప్రదానం చేసిందని గుర్తు చేశారు. తమ సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు పూర్తి స్థాయి మద్దతు తెలుపుతున్నామని.. కాలేరు వెంకటేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు టి.రాజేందర్, డి.మల్లికార్జున్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం ప్రతినిధులు భిక్షపతి, వెంకటేశ్, బాబురావు, శ్రవణ్ కుమార్, వరప్రసాద్, నర్సింగ్‌రావు, వీరన్న, సరితాబాయితో పాటు బీఆర్ఎస్ నాయకులు బిల్డర్ ప్రవీణ్, గెల్వయ్య పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ బీఆర్ఎస్‌లో చేరికలు

- కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడితో సహా గులాబీ తీర్థం పుచ్చుకున్న నేతలు
- ఆ పార్టీలో గుర్తింపు లేదని ఆవేదన

బంజారాహిల్స్, నవంబర్ 15 : ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో చేరికల జోరు కొనసాగుతున్నది. జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సీనియర్ నేత కాటూరి రమేశ్‌తో పాటు పలువురు ముఖ్యనేతలు ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు భవానీ రమేశ్, నియోజకవర్గ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పెండ్యాల విజయలక్ష్మి, ఏ-బ్లాక్ అధ్యక్షురాలు కవిత, సీనియర్ నాయకులు శ్యామ్ నాయుడు, గౌస్, నాగార్జున, అంజమ్మ, ప్రభావతి తదితరులున్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన తమకు గుర్తింపు లేకపోవడంతో పాటు అనేక రకాలైన అవమానాలు ఎదురవుతుండటంతో పార్టీకి రాజీనామా చేశామని కాటూరి రమేశ్ పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ విజయం కోసం పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావు, నగేశ్ సాగర్, రవినాయక్, రాజు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేశ్‌తో పాటు ఇతర నాయకులతో ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

## రేవంత్‌రెడ్డి ఓ బ్లాక్ మెయిలర్: ఎమ్మెల్యే అభ్యర్థి దానం

హిమాయత్‌నగర్, నవంబర్15 : సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఖైరతాబాద్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ డివిజన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దానం నాగేందర్ మీడియాతో మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిలర్‌గా మాట్లాడటం సరి కాదని, రాష్ట్రంలో 90 లక్షల మందికిపైగా ప్రజలు వివిధ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందారని వారిని అడిగితే మేలు జరిగిందా? లేదా అని చెబుతారన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ చెప్పిన గ్యారంటీలు అమలు కావడం లేదని.. అక్కడి ప్రజలే చెబుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో మోస పూరిత వాగ్దానాలు ఇస్తున్న కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మడం లేదన్నారు. కేసీఆర్‌ను మరోసారి సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఈ నెల 30న ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.